# సూర్య
నేటి దినపత్రిక
17వ వసంతంలోకి...
ఎన్టీఆర్ - కృష్ణా
బుధవారం 31 జులై 2024 పేజీలు 8


## జిల్లాలో క్రీడా రంగానికి ప్రోత్సాహం

### కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ




**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో క్రీడా రంగానికి అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. వరుసగా 8వ రోజు మంగళవారం ఉదయం నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జరిగిన ప్రత్యేక ఉచిత యోగా శిక్షణా తరగతులలో జిల్లా కలెక్టర్ పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం ప్యారీస్‌లో జరుగుతున్న ఒలంపిక్స్ క్రీడలు పురస్కరించుకొని 2

# మానవ అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు




**మహిళలకు, బాలలకు అన్ని విధాల రక్షణ కల్పిస్తాం**

**రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఆబ్కారి శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా జరిగితే రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ముఖ్యంగా మహిళలకు, బాలలకు అన్ని విధాల రక్షణ కల్పిస్తామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఆబ్కారి శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని హిందూ కళాశాలలోని దైత శ్రీరాములు ఆడిటోరియంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, సంస్థ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్యతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 2019-24 మధ్యకాలంలో దాదాపు 34 వేల మంది మహిళలు, చిన్నపిల్లలు తప్పిపోయారన్నారు. ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇదివరకే ప్రభుత్వ దృష్టికి తెచ్చారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ కూడా మానవ అక్రమ రవాణా జరక్కుండా అన్ని నివారణ చర్యలు గట్టిగా తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఎక్కడ కూడా ఆడబిడ్డలపై అఘాయిత్యం గాని లైంగిక వేధింపులుగాని మిగతా 2లో



## తొలిరోజే 99 శాతం మేర పెన్షన్ల పంపిణీకి కృషి

- ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి పూర్తిస్థాయి ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జులై 30, మేజర్ న్యూస్ :** ఆగస్టు 1, గురువారం ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారులకు ఇళ్ల వద్దే అందించే ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద చేపట్టే సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్య లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్... అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ సృజన.. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం కె.ప్రియాంకతో కలిసి హాజరయ్యారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా మిగతా 2లో...

# ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకే ఇసుక

### జాయింట్ కలెక్టర్ నిధి మీనా



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జులై 30, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అమలులోకి తీసుకురావడం జరిగిందని వాహనదారులు ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకు రవాణా చేసి ఇసుకను రవాణా చేసి ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచాలన్న ఆశయంతో భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ నిధి మీనా తెలిపారు. ఇసుక రవాణా రేట్ల నిర్ధారణపై ట్రాక్టర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లతో జాయింట్ కలెక్టర్ నిధి మీనా మంగళవారం కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కీసర, మొగలూరు, అల్లూరుపాడు, కొడవటికల్లు, మగాల్లు, అనుమంచిపల్లి తదితర మిగతా 2లో...



(మొదటిపేజీ తరువాయి)



## జిల్లాలో క్రీడా రంగానికి ప్రోత్సాహం




జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఏర్పాటు చేసిన ఒలంపిక్స్ ఫోటోబోర్డుతో సెల్ఫీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సెల్ఫీ తీసుకున్నారు. ప్యారీస్ లో జరుగుతున్న ఒలంపిక్ క్రీడల్లో మన భారతదేశానికి చెందిన క్రీడాకారులు బాగా రాణించి పతకాలు సాధించి దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన భారతదేశానికి చెందిన మను బాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్లో కాంస్య పతకం సాధించడం గర్వించదగ్గ విషయం అన్నారు. జిల్లాలో క్రీడాకారులకు అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తామన్నారు. మండల కేంద్రమైన నాగాయలంకలో కేనోయింగ్, కియా కింగ్ జల క్రీడల ను ప్రోత్సహించేందుకు అసంపూర్తిగా ఉన్న క్రీడా శిక్షణా అకాడమీ భవ నాన్ని పూర్తి చేసెలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఝాన్సీ లక్ష్మి, జిల్లా పశుసంవర్ధక అధికారి శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి చంద్ర శేఖర్, సమాచార పౌర సంబంధాల శాఖ డిడి యమ్ వెంకటేశ్వర ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏడి పార్ధసారథి, యోగా గురువులు ముదిగొండ శాస్త్రి మద్దాల చింతయ్య, శీలం రమేష్ పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## తొలిరోజే 99 శాతం మేర పెన్షన్ల పంపిణీకి కృషి



రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన అధికారులతో మాట్లాడారు. ఉదయం ఆరు గంటలకు పెన్షన్ పంపిణీని ప్రారంభించి.. ప్రక్రియ సాఫీగా సాగేలా చూడాలన్నారు. లబ్ధిదారుల సామాజిక భద్రత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని తొలిరోజే 99 శాతం మేర పూర్తిచేసేందుకు కృషిచేయాలన్నారు.

ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయంతో పనిచేయాల న్నారు. జిల్లాలో 2,34,143 మంది పెన్షన్‌దారులకు రూ. 98.80 కోట్ల మేర మొత్తాన్ని అందించాల్సి ఉందని... పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వ ఉద్యో గులను లబ్ధిదారులతో మ్యాప్ చేయడం జరిగిందన్నారు. ఎ.కొండూరు మండలంలో 7,485 పెన్షన్లు, చందర్లపాడులో 10,017, జి.కొండూరులో 8,728, గంపలగూడెంలో 11,583, ఇబ్రహీపట్నంలో 4,845, జగ్గయ్య పేట (అర్బన్)లో 4,910, జగ్గయ్యపేటలో 10,338, కంచికచర్లలో 10,363, కొండపల్లి (అర్బన్)లో 5,305, మైలవరంలో 9,734, నందిగా మలో 8,048, నందిగామ (అర్బన్)లో 4,298, పెనుగంచిప్రోలులో 8,580, రెడ్డిగూడెంలో 7,284, తిరువూరులో 6,865, తిరువూరు (అర్బన్)లో 3,430, వత్సవాయిలో 9,693, వీరుళ్లపాడులో 8,841, విజయవాడ (అర్బన్)లో 68,224, విజయవాడ రూరల్‌లో 17,277, విస్సన్నపేట మం డలంలో 8,295 పెన్షన్లు ఉన్నట్లు వివరించారు. 31వ తేదీ సాయం త్రంలో గా బ్యాంకుల నుంచి నగదును విత్‌డ్రా చేసి, పంపిణీ ప్రక్రియను సరళీకృ తం చేసేలా డినామినేషన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. పెన్షన్ల పంపి ణీ జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షించి, పంపిణీ సాఫీగా సాగేలా చూడాలని కలెక్టర్ సృజన పేర్కొన్నారు.

# మానవ అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు




(మొదటిపేజీ తరువాయి)

జరిగితే ఎట్టి పరిస్థితులలో సహించేది లేదని అదే వారికి చివరి రోజు అని స్పష్టం చేశారన్నారు. ఎంతో భవిష్యత్తు పైన ఆశలతో తల్లిదండ్రులు ఆడబిడ్డలను చదువుకోవాలని ప్రోత్సహిస్తే వారికి రక్షణ లేకుండా పోవడం విచారకరమన్నారు. నిర్భయ, దిశ చట్టాలు వచ్చిన మహిళలపై అఘాయిత్యాలు జరిగాయన్నారు. గతంలో ఆడపిల్లలను కో ఎడ్యుకేషన్ కళాశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు ఇష్టపడేవారు కాదని, నేడు మార్పులు జరిగి అన్ని రంగాలలో మహిళలే ముందంజలో ఉంటున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వారి కోసం తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక నిధులు ఖర్చు చేస్తుందని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. మచిలీపట్నానికి మహర్దశ రాబోతుందని ఓడరేవు నిర్మాణం శరవేగంతో జరుగుతుందని ఈ ప్రాంతంలో 70 వేల కోట్ల రూపాయల వ్యయంతో బిపిసిఎల్ ఆయిల్ రిఫైనరి పరిశ్రమ రాబోతుందని అందులో ఈ ప్రాంత యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని అంతరాత్మను నమ్ముకోవాలని సూచించారు. 2014 జనవరి 12వ తేదీ స్వామి వివేకానంద జయంతి రోజున హిందూ కళాశాలలో యువకిరణాలు పేరుతో మంచి కార్యక్రమాన్ని చేపట్టామని దాన్ని మరలా మొదలు పెడతామన్నారు. అందుకు విద్యార్థులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థినులు తాత్కాలిక ప్రలోభాలకు లోనుకాకుండా, మానవ అక్రమ రవాణా బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మత్తుమందు తయారీ, మానవ అక్రమ రవాణా సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రతి ముగ్గురు పిల్లల్లో ఒకరు అక్రమ రవాణాకు గురవుతున్నారని, విదేశాల నుంచి 20 శాతం మంది దిగుమతి అవుతున్నారని, దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 7వ ర్యాంకులో ఉందని, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలో ఎక్కువగా మానవ అక్రమ రవాణా జరుగుతుందన్నారు. చట్టప్రకారం అందరికీ సమానత్వం పాటించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, బాల్యవివాహాలు నేరమని స్పష్టం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మహిళలకు, పేదవారికి ఉచితంగా న్యాయ సలహాలు, న్యాయ సహాయం అందిస్తుందని ఎవరికైనా హక్కులు భంగం వాటిల్లితే ఏమైనా అవసరం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేయవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డి సి పి ఓ మోనిషా మాట్లాడుతూ బాలలు ఎవరైనా తప్పిపోతే 1098 హెల్ప్ లైన్ నెంబర్ కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి వెంకటేశ్వరరావు, డిఎస్పి నాగరాజు, మాజీ పార్లమెంటు సభ్యులు కొనకల్ల నారాయణ రావు, ఐసిడిఎస్ పిడి సువర్ణ, డి సి పి ఓ మోనిషా, డీఈవో తహేరా సుల్తానా, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం కుటుంబరావు, పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీ. అన్నపూర్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భారతి, స్థానిక ప్రముఖ నాయకులు బండి రామకృష్ణ, చీఫ్ లీగల్ హెడ్ ముసలయ్య, సిడిపిఓలు, అంగన్వాడి కార్యకర్తలు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకే ఇసుక

(మొదటిపేజీ తరువాయి)

ఆరు డిపోల ద్వారా ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రజ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేసే ఉచిత ఇసుక విధానానికి తోడ్పాటునందిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకు ప్రజలకు ఇసుకను రవాణా చేసేందుకు సహకరించాలని జాయింట్ కలెక్టర్ ట్రాక్టర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు తెలిపారు. ఇసుక రవాణాకు సంబంధించి వాహనదారులు మైలేజి, డీజిల్, టోల్ గేట్స్, ఇతర అన్ని ఖర్చులతో కలిపి ట్రాక్టర్ ద్వారా ఒక యూనిట్ ఇసుకను రవాణా చేసేందుకు పది కిలోమీటర్లలోపు 800 రూ., పది కిలోమీటర్ల నుండి 20 కిలోమీటర్లు రూ. 1500, 20 కి.మీ దాటిన తరువాత ప్రతి కిలో మీటరుకు అదనంగా టన్నుకు 50 రూపాయలు అదనంగా వసూలు చేయాలన్నారు. 6 టైర్స్ లారీ ద్వారా రెండు యూనిట్ల ఇసుకను పది కిలోమీటర్ల లోపు 1500 రూపాయలు, పది కిలోమీటర్ల నుండి 20 కిలోమీటర్ల లోపు 2300 20 కి.మీ దాటిన తరువాత ప్రతి కిలో మీటరుకు టన్నుకు 80 రూపాయలు అదనంగా వసూలు చేయాలన్నారు. 10 టైర్స్ లారీ ద్వారా 4 యూనిట్లు ఇసుకను సరఫరా చేసేందుకు పది కిలోమీటర్ల లోపు రూ. 2000, పది నుండి 20 కిలోమీటర్ల లోపు రూ. 3000, 20 కి.మీ దాటిన తరువాత ప్రతి కిలో మీటరుకు టన్నుకు 100 రూపాయలు అదనంగా వసూలు చేయాలని, 12 టైర్స్ వాహనం ద్వారా 5 యూనిట్లు ఇసుక రవాణకు 10 కిలోమీటర్ల లోపు రూ. 2500, పది కిలోమీటర్లు దాటి 20 కిలోమీటర్ల లోపు 3600 రూపాయలు 20 కి.మీ దాటిన తరువాత ప్రతి కిలో మీటరుకు టన్నుకు 110 రూపాయలు చొప్పున అదనంగా రవాణా చార్జీల కింద వాహన దారులు వసూలు చేయాలన్నారు. రవాణా శాఖ అధికారులు ఇసుక రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకు విరుద్ధంగా అధిక రేట్లు వసూలుచేసే వాహనదారులపై రవాణా శాఖ అధికారులు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ నిధి మీనా సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమీషనర్ ఎం. పురేంద్ర, మైన్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ది. కృష్ణా సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాంబిరెడ్డి, విజయవాడ సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. శ్రీనివాసరావు, విజయవాడ అర్బన్ సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి. వెంకటేశ్వరావు, భూగర్భ గనులు, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ముద్దాల రవిచంద్రకు
## బీసీ సంఘం అభినందనలు



**విజయవాడ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పర్సనల్ సెక్రటరీగా నియమితులైన ముద్దాల రవిచంద్ర ను ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు నేతృత్వంలోని బీసీ నాయక బృందం, అమరావతి సచివాలయంలోని వారి కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపింది. ప్రజల విజ్ఞప్తులకు వెంటనే స్పందిస్తూ, పరిష్కారాలను ప్రభుత్వానికి సూచిస్తూ అందరి మన్ననలు పొందుతూ వస్తున్న ఐఏఎస్ అధికారిగా మద్దాల ను అన్ని వర్గాల ప్రజలు అభినందిస్తున్నా రన్నారు. అటువంటి రవిచంద్రను పర్సనల్ సెక్రటరీగా నియమించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందిస్తున్నామన్నారు. ప్రజలందరి ముఖ్యంగా బీసీ ఉద్యోగుల ఫిర్యాదులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. బీసీ సమాజాభివృద్ధి కోసం విధానపరమైన పలు పథకాల రూపకల్పనలో, వాటి అమలులో ప్రభుత్వానికి అన్ని విధాల సహకరిస్తారని ఆకాంక్షించారు. తప్పక ప్రజలందరితోపాటు, బీసీల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రవిచంద్ర తెలియజేశారు. ఇంకా వారిని అభినందించి,ఘనంగా సన్మానించిన బీసీ నాయకులలో రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాస్, అక్కినపల్లి బాలయ్య, గేదెల సూర్యప్రకాష్ తదితరులు ఉన్నారు.





# నగరం మొత్తం సైన్ బోర్డులు పెట్టండి

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజల కోసం నగరపాలక సంస్థ కల్పించిన వసతులను సులువుగా తెలుసుకునేందుకు ఆ ప్రదేశాలను చూపించే సైన్ బోర్డు లను నగరం మొత్తం పెట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మంగళవారం ఉదయం ఎంజీ రోడ్, పటమట, పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పబ్లిక్ టాయిలెట్లు, అన్న క్యాంటీన్లకు, మొదలగు విజయవాడ నగరపాలక సంస్థ కల్పిస్తున్న వసతులు అన్నిటికీ అవి ఎక్కడున్నాయో ప్రజలకు తెలిపే సైన్ బోర్డులను నగరం మొత్తం అమరచాలని, తద్వారా ప్రజలకు సులువుగా వాటిని తెలుసుకునే అవకాశం కల్పించవచ్చని అన్నారు. తదుపరి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం సందర్శించి ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు విజయవాడ నగర పలక సంస్థ తీసుకోవాల్సిన చర్యలను, ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలి అన్నారు. పటమటలో పర్యటించి అక్కడ జరుగుతున్న డీసెల్టింగ్ పనులను పరిశీలించారు, డిసిల్టింగ్ పనులను ఏ విధంగా చేస్తున్నారు దానికి వాళ్ళు అనుసరిస్తున్న పద్ధతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సైడ్ డ్రైనలను మ్యాప్ లో మార్కింగ్ చేసుకుంటూ శుభ్రపరచుకుంటే సైడ్ డ్రైనలలో పూడికల సమస్య పరిష్కరించవచ్చని అన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న పెద్ద హోర్డింగ్ లు చూసి, వాటికి స్ట్రక్చరర్స్ స్టెబిలిటీ సర్టిఫికెట్ ఉన్నాయో లేవో పరిశీలించవలసిందిగా టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలలు జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని, స్ట్రక్చర్ స్టెబిలిటీ సర్టిఫికెట్లు ప్రతి హోర్డింగ్ అవసరమని దానికి తగు చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతోపాటు చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నవళి, జోనల్ కమిషనర్లు కే ప్రభుదాస్, శివరామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాస్, ఏ ఎస్ ఎన్ ప్రసాద్, సామ్రాజ్యం, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్, తదితరులు పాల్గొన్నారు.







# డిగ్రీ కోర్సుల నూతన ప్రవేశానికి ఆగష్టు 18 ఆకరి తేది



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** డిగ్రీ కోర్సుల నూతన ప్రవేశానికి ఆగష్టు 18 వ తేది వరకు అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి చెప్పారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, బి.ఎ, బి.కాం, బి.ఎస్సి కోర్సులకు నూతన ప్రవేశం ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు ప్రవేశం పొందేందుకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్ ఉత్తీర్ణులు అయిన వారు ఇందుకు అర్హులని ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆమె తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ 10 వ తరగతి, ఇంటర్ మార్క్‌లిస్ట్, ఆధార్, కులధృవీకరణ పత్రం, పాస్ సైజ్ ఫోటోస్ రెండు తీసుకుని రావాలని ఆమె చెప్పారు. ద్వితీయ, తృతీయ సంవత్సరానికి తమ ప్రథమ సంవత్సరం రసీదు లేదా ఐడి కార్డు తీసుకుని ఎ.పి ఆన్‌లైన్ సెంటర్లలో ఫీజు చెల్లించి అప్లికేషన్ రసీదు పొంది భద్రపరుచుకోవాలన్నారు. విశ్వ విద్యాలయం అధ్యాయన కో ఆర్డినేటర్ ఆర్ అంకారావు మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీషు మిడియంతో పాటు ఉర్దూ మీడియం కూడా అందుబాటులో ఉందన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయం, అభ్యాసకులు, సహాయ కేంద్రం,సెల్ నెం 7382929812 కానీ జూనియర్ అసిస్టెంట్ పి లక్ష్మీనారాయణ ఫోన్ నెం 9440176821 గానీ సంప్రదించాలన్నారు. ఇంటర్ వైజ్ అనగా 2016 ముందు వారికి కూడా ఇవే తేదిలు వర్తిస్తాయన్నారు.

# ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చుకుందాం




## కాలుష్య రహిత సమాజానికి తోడ్పడుదాం

## నగర కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ ను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని, కాలుష్య రహిత సమాజానికి ప్రజలందరూ తోడ్పడాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, సఫాయి కర్మచారి అసోసియేషన్ అండ్ ట్రీస్ గ్రూప్ వారు మంగళవారం ఉదయం, బీసెంట్ రోడ్‌లో కల్పిస్తున్న అవగాహన కార్యక్రమంలో అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజానికి ఎల్లప్పుడూ విజయవాడ నగరపాలక సంస్థ సహకరిస్తుందని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం వారు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధించాలని, ప్రకృతి ప్రియమైన జ్యూట్ బాక్స్, క్లాత్ బ్యాగ్స్ లాంటి వాటిని వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సఫాయి కర్మ చారి అసోసియేషన్ అండ్ ట్రీస్ గ్రూప్ స్టేట్ ప్రెసిడెంట్ బండి కాలేశ్వర్ రావు, బంగారు శివ నాగరాజు విషయం శెట్టి లక్ష్మీనారాయణ, కొమర ఎల్లారావు, తుపాకుల రావణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జీ తెలుగు సరిగమప సీజన్ 16 ఆడిషన్స్ మన రాజమండ్రి, విజయవాడలో!




**విజయవాడ, మేజర్ న్యూస్ :** విజయవంతంగా 15 సీజన్లు పూర్తి చూసుకున్న జీ తెలుగు 'సరిగమప సీజన్ 16- ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్'ను ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ఆడిషన్స్ నిర్వహిస్తోంది.. ప్రతిభను ప్రోత్సహిస్తూ మట్టిలోని మాణిక్యాలను వెలికితీసేందుకు ఈ శని, ఆదివారాల్లో మన రాజమండ్రి, విజయవాడలో ఆడిషన్స్ నిర్వహిస్తోంది. 15-30 సంవత్సరాల వయస్సుగల గాయనీగాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను నిరూపించుకోవచ్చు. సరిగమప సీజన్ 16 ఆడిషన్స్ ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయి. రాజమండ్రిలో ఆగస్టు 03న కలామ్ జూనియర్ & డిగ్రీ కాలేజ్, కన్నమ్మ తల్లి స్ట్రీట్, అల్కాట్ గార్డెన్స్, మెయిన్ రైల్వేస్టేషన్ ఎదురుగా, ఆగస్టు 04న విజయవాడలోని గేట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ & సైన్సెస్, గురునానక్ కాలనీ, పటమట హైస్కూల్ రోడ్, బెంజ్ సర్కిల్ సమీపంలో ఆడిషన్స్ జరగనున్నాయి. వివరాల కోసం 9154670067 నెంబర్ని సంప్రదించవచ్చు. ఆసక్తి గలవారు జీ తెలుగు అందిస్తున్న ఈ గోల్డెన్ ఛాన్స్ని మిస్ కావద్దు! అంతేకాదు ఔత్సాహికులు ఆగస్టు 30 వరకు డిజిటల్ ఆడిషన్స్ ద్వారా కూడా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవచ్చు. పాట పాడిన తమ వీడియోలను 9154670067 నెంబర్కి వాట్సాప్ లేదా ztsaregamapa@zee.com ఇమెయిల్ ద్వారా పంపవచ్చు. ఇంకెందుకు ఆలస్యం జీ తెలుగు 'సరిగమప సీజన్ 16- ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్' టైటిల్ కోసం మీరూ పోటీలో పాల్గొనండి!

## పర్యాటకులను ఆకర్షించే.. కెనాల్ బోటింగ్ ప్రణాళిక సిద్ధం చేయండి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** బందర్ కాలువ, ఏలూరు కాలువ, రైవస్ కాలువ నడుమనున్న నగరంని పర్యాటకులను ఆకర్షించే విధంగా కెనాల్ బ్యూటిఫికేషన్‌ను చేసి, దానికి అనుగుణంగా బోటింగ్ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం పర్యాటకులను ఆకర్షించే విధంగా కెనాల్ బోటింగ్ రూపకల్పనకు పర్యటించి, పరిశీలిం చారు. కెనాల్ కి ఇరువైపులా గ్రీనరీ నేపెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు, డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు కెనాల్‌లో వ్యర్ధాలను వేయకుండా పర్యవేక్షించేటట్టు చూసుకోవాలని, అలా వ్యర్ధాలు వేసిన వారికి జరిమానా విధించాలని. కాలువల్లో ప్రవహించే నీరు చుట్టుపక్కల ప్రాంతాల గ్రామ ప్రజలకు తాగునీరైనందున నీరు కలుషితం కాకుండా ప్లాస్టిక్ వ్యర్ధాలను నగర పరిధిలోనే నీటి పైనే ఫ్లోటింగ్ పైపులను ఏర్పాటుచేసి వ్యర్ధాలను అవి దాటిపోనీయకుండా నెట్లను అమర్చి, కన్వేయర్ బెల్ట్ సహాయంతో వ్యర్ధాలను బయటకు తెచ్చే విధంగా చర్యలు తీసుకునేటట్టు చూడమని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతోపాటు అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ కే వి సత్యవతి బయాలజిస్ట్ సూర్య కుమార్ పాల్గొన్నారు.



# క్రమశిక్షణతో కష్టపడి కెరీర్ పరంగా ఎదగాలి

- ఆత్మవిశ్వాసంతో అడుగేసి అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- మనల్ని మనం కాపాడుకుంటూ మన చుట్టూ ఉన్నవారిని కాపాడుకుందాం
- మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.సృజన

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జులై 30, మేజర్ న్యూస్ :** అమ్మాయిలు ఆత్మవిశ్వాసంతో అడుగేసి క్రమశిక్షణతో కష్టపడి కెరీర్ పరంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన సూచించారు. మంగళవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మేరీస్ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో మేరీస్ స్టెల్లా కాలేజీ మహిళా సాధికారత సెల్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్‌బీ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, పోలీస్ కమిషనరేట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ సృజన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా తీవ్ర నేరమని, నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కష్టపడకుండా ఏదీ రాదని.. ఒకవేళ వచ్చిందంటే దాంతో పాటు ప్రమాదమూ పొంచిఉందన్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు. సమస్యను గుర్తించి.. దాన్ని ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఎలా ఉండాలనే విషయంపై జాగృతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయ న్నారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నతంగా ఎదిగి తమ కాళ్లపై తాము నిలబడుతూ ఆర్థిక సాధికారత సాధించి పది మందికి ఆదర్శంగా నిలవాలన్నారు. మనం ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ బయట నుంచి అనుకోకుండా ప్రమాదాలు వస్తాయని.. వాటిని గుర్తించి, ఎదుర్కొని సురక్షిత మార్గంలో పయనించి మన జీవితాల్ని భద్రమైన మార్గం వైపు నడిపించుకోవాలన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మేరీస్ స్టెల్లా కళాశాల, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్‌కు అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ సృజన పేర్కొన్నారు. బాల్యం అమూల్యం, బాలల రక్షణ మనందరి బాధ్యత అని గుర్తుచేస్తూ అమ్మాయిలు తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలపై జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి జి.ఉమాదేవి, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ డైరెక్టర్ బీఎస్ కోటేశ్వరరావు, మేరీస్ స్టెల్లా కరస్పాండెంట్ సిస్టర్ లీనా క్వాడ్రస్ తదితరులు మార్గనిర్దేశనం చేశారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ప్రత్యేక పోస్టర్లను ఆవిష్కరించారు. చైల్డ్ లైన్ (1098), డయల్ 100/112 (పోలీస్), ఉమెన్ హెల్ప్‌లైన్ (181)పైనా అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక పోరాటంలో భాగస్వాములమవుతామం టూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మేరీస్ స్టెల్లా కరస్పాండెంట్ సిస్టర్ లీనా క్వాడ్రస్, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ డా. సిస్టర్ రేఖ, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ డా. వీఎన్ మంగాదేవి, దిశ మహిళా పోలీస్ స్టేషన్ అధికారి అనూష, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ అరవా రమేష్, బర్డ్స్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కె.ప్రకాష్ కుమార్ తదితరులు హాజరయ్యారు.










## పోలీసుల రక్షణ కోరిన ప్రేమ జంట

**నందిగామ, జులై 30, మేజర్ న్యూస్:** మండలం లోని సోమవరం గ్రామానికి చెందిన ఓ ప్రేమ జంట పెళ్లిచేసుకొని సోమవారం రాత్రి రక్షణ కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం సోమవరం గ్రామానికి చెందిన జిల్లేపల్లి నితీష్ (23) అదే గ్రామానికి చెందిన సరళ (20) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కంచికచర్ల మండలం కీసర గ్రామంలో గల ఆర్.సి.ఎం. చర్చిలో సోమవారం వివాహం చేసుకున్నారు. తమ ప్రేమ పెళ్లిని ఇరువురి తల్లిదండ్రులు అంగీకరించక పోవడంతో తమకు రక్షణ కల్పించాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఎస్సై పండు దొర ఇరువురు తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఎవరు ఎటువంటి గొడవలు పెట్టుకోకూడదని కౌన్సిలింగ్ ఇచ్చారు.



## మొక్కల పోషకాలపై రైతులకు అవగాహన



**నందిగామ, జులై 30, మేజర్ న్యూస్:** సేంద్రీయ కర్బనం తో మొక్కలకు పోషకాలు భూమిలో సేంద్రియ కర్బనం పెంచడం ద్వారా మొక్క పోషకాలు గ్రహించగలుగుతుందని జిల్లా వనరుల కేంద్రం విజయవాడ ఏ డి ఏ పి మనీషా తెలిపారు. నందిగామ మండలం ఐతవరం గ్రామంలో రైతుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడిఏ మనీషా మాట్లాడుతూ పశువులు వానపాములు ఎరువులు, జీలుగా జనమ పిల్లి పేసరా వంటి విత్తనాలు వేయడం ద్వారా సేంద్రీయ కర్బ నం పెంచుకోవచ్చునున్నారు. ఏ డి ఏ ఐ కే శ్రీనివాస్ మాట్లాడుతూ పత్తిలో గులాబీ రంగు తగ్గించుకోవడానికి సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పురుగుమందులో వేప నూనె కలపడం వలన గుడ్లు పిల్ల పురుగులుగా మారకుండా నివారించవచ్చు అన్నారు. ఎం ఏ ఓ ఎస్ ఎన్ ఐ కాసిం మాట్లాడుతూ వరిలో ప్రతి 20 సెంటీమీటర్లు బాట వేసుకోవడం వలన పైరుకు గాలి వెలుతురు తగిలి చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. వరి నాటే ముందు కొనలు తుంచి నాటడం వలన కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు ప్రభావం తగ్గుతుందన్నారు. ముందుగా అధికారులు క్షేత్ర సందర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వి ఏ ఏలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



### మున్సిపల్ నూతన రైతు బజార్‌లో...

## దోసకాయలు ఉచిత పంపిణి

**జగ్గయ్యపేట జూలై 30 మేజర్ న్యూస్ :** పట్టణంలో మున్సిపల్ రైతు బజార్ లో కూరగాయలు కోనేందుకు వచ్చిన వినియోగదారులకు రెండవ రోజు మంగళవారం దోసకాయలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. రెండవ రైతుబజార్ కు వినియోగదారు లను ఆకర్షించేందుకు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సూచనల మేరకు ఎస్టేట్ ఆఫీసర్ కే వెంకటరమణ, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, పదవ వార్డు కౌన్సిలర్, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి వినియోగదారులకు ఉచితంగా అందజేశారు. దోసకాయలను ఉచితంగా పంపిణీ చేయడం పట్ల వినియోగదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

## రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కృష్ణ డెల్టాలో సాగునీటి కాలువలు డ్రైనేజీలలో గుర్రపు డెక్క, తూడు తొలగించడం, డీసిల్టేషన్ పనులు ముమ్మరంగా చేపట్టి ముంపు బారి నుండి పంటలను కాపాడాలని, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జల వనరుల శాఖ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్ లో మీకోసం హాల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగునీటి కాలువల డ్రైనేజీల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పులిచింతలలో 40 టిఎంసిల వరకు నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, దానిని డెడ్ స్టోరేజ్ కంటే దిగువ 0.8 ఎంసీలకు పడిపోయిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రాగానే తాగు సాగునీటి అవసరాల కోసం పట్టిసీమ నుండి 20 పంపులతో 7 వేల క్యూసెక్కుల వరకు నీటిని వదలడం జరిగిందన్నారు. అత్యవసరంగా సాగునీటి కాలువలు డ్రైనేజీలలో గుర్రపుడెక్క తూడు తొలగింపు పనులకు నిధులు మంజూరు చేసిందని అన్నారు. రైతులకు అవసరమైన సాగునీరు అం దించి డెల్టాలో కాలువల శివారు ప్రతి ఎకరా కాపాడాలని ప్రభుత్వం దృడ సంకల్పంతో ఉందన్నారు. ఈ ఏడాది కృష్ణాడెల్టా సాగునీటి అవసరాలకు 10 వేల క్యూసెక్కుల నీరు అవసర మన్నారు. పట్టిసీమ నీటితో పాటు కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ ద్వారా నాగార్జునసాగర్ నుంచి 10 టీఎంసీల నీరు ఇవ్వా లని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం కారం కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని కృష్ణ బేసిన్ విజయవాడలో ఏర్పాటు చేయాలని, కృష్ణా డెల్టాలో ఔట్సోర్సింగ్ లో లస్కర్లను నియమించాలని, గన్నవరం నియోజకవర్గంలో పోలవరం కుడి కాలువ 137.290 కి.మీ. నుండి ఏలూరు కాలువ అనుసంధానానికి రివైజ్డ్ ఎస్టిమేట్స్ ద్వారా గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ద్వారా అడిగిన 32.10 కోట్లకు వెంటనే కొత్తగా టెండర్లు పిలవాలని ఈ సమావేశం తీర్మానించిందన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ తాగునీరు తొలి ప్రాధాన్యం కాగా, సాగునీటికి మలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కాలువలు డ్రైనేజీలలో నిర్వహణ పనులు పటిష్టవంతంగా నిర్వహించాలని, ఈ పనులు స్వయంగా పర్యవేక్షిస్తామని, రైతులతో మాట్లాడుతామని, ఏవైనా తేడాలుంటే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అవనిగడ్డ, కైకలూరు, పామర్రు, పెడన శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, కామినేని శ్రీనివాస్, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొని వారి వారి నియోజకవర్గాల్లో రైతుల సాగునీటి సమస్యలు సమావేశంలో తెలియజేస్తూ, వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాల ప్రతినిధులు ఆళ్ళ గోపాలకృష్ణ తదితరులతో పాటు, ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, డ్రైనేజీ, ఆర్డబ్ల్యూఎస్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఆడి కృత్తికలో పోటెత్తిన జనం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కృష్ణాజిల్లా మచిలీపట్నం మేకవానిపాలెం శ్రీ నాగేంద్ర స్వామి, శ్రీ వల్లి దేవసేన సమ్మేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానము నిర్వహించిన ఆడి కృత్తిక కార్యక్రమం నగరములోని ప్రధాన వీధులన్నీ భక్తులతో పోటెత్తి మురగన్ కు హరో హర వేలు ముక్కు అరోహరో అని మారుమోగాయి. ఆషాఢ మాసంలో కృత్తిక నక్షత్రం ఉన్న రోజున ఆడి కృత్తిక గా జరుపుకుంటారు. సుబ్రహ్మణ్యస్వామికి అత్యంత ప్రీతికరమైన రోజు. ఆడి కృత్తిక నాడు సుబ్రహ్మణ్య భక్తులు క్షేత్రాలను దర్శించి విశేష పూజలు చేస్తారు. వీటిని ఒకే రోజులో దర్శించలేం. ఆడి కృత్తిక నాడు శరవణ భవ నామంతో కలిపి ఈ క్షేత్రాల పేర్లను తలుచుకుంటే దర్శించిన ఫలం లభిస్తుంది నమ్మకం. పార్వతీ దేవి సుబ్రహ్మణ్యుని మాతృకలైన కృత్తికలకు ఏ మాసంలోనైనా కృత్తికా నక్షత్రం రోజున ఎవరైతే సుబ్రహ్మణ్య స్వామివారిని ఆరాధిస్తారో వారికి సుబ్రహ్మణ్యుని సంపూర్ణ అనుగ్రహం కలుగుతుందని వరం ప్రసాదించిందట. అందులోనూ దక్షిణాయనానికి ముందు వచ్చే కృత్తిక గనుక దీనిని ఆది కృత్తిక అనీ, ఆషాడ మాసంలో వచ్చేది కనుక ఆడి కృత్తిక అనీ కూడా అంటుంటారు. అందుకే ఆషాఢ ఆడి కృత్తిక సుబ్రహ్మణ్యుని ఆరాధనకు అత్యంత శ్రేయస్కరమైనది. మురగనుకు హోరోహర, “వేలునుకు హరో హరో”, “వెల్ వెల్ మురుగు శక్తివేల్ మురగా” అంటూ భజనలతో ఆటపాటలతో ఎంతో వైభవంగా ఈ కావడి ఉత్సవాలు ఈ ఆషాడ మాసంలో కృతిక నాడు కావడి ఎత్తుతాము అని ఏదైనా మొక్కు ఉన్న వారికి తప్పకుండా ఆ కోరిక నెరవేరుతుంది అని భక్తుల నమ్మకం.

మొక్కు ఉంటేనే కాదు భక్తితో కావడి ఉత్సవం చేసుకునే వారు చాలా మంది ఉంటారు. ఈ కావడి తీసుకుని సుబ్రహ్మణ్యం స్వామి దగ్గరికి వెళ్లే వారికి వివాహ దోషాలు, తరచూ వచ్చే ఆరోగ్యం సమస్యలు, పిల్లలు పుట్టక ఇబ్బంది పడే వారు, తరచూ ఎదో ఒక ఆటంకాలతో వ్యాపారంలో ఇబ్బందులు ఉన్న వారు ఈ కావడి ఎత్తి దర్శనంకి వెళ్లడం వల్ల వారి సమస్యలు తొలగి సంతోషంగా ఉంటారని భక్తుల నమ్మకం.

## పట్టాదారు పాసుపుస్తకంపై రాజముద్ర పునరుద్ధరణపై గొర్రెపాటి గోపీచంద్ హర్షం

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** పట్టాదారు పాసుపుస్తకంపై రాజముద్ర పునరుద్ధరణపై టిడిపి సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ హర్షం వ్యక్తం చేశారు. మచిలీపట్నం సిడింబి అగ్రహారం ఆయన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశం గోర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ త్వరలో రాజముద్రతో భూయజమానులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందచేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేసి పట్టాదారు పాసుపుస్తకం పై రాజముద్ర వేసి ఇస్తామని చెప్పిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు. దేశంలో ఎప్పుడూ, ఎక్కడా లేని విధంగా గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి పట్టాదారు పాసు పుస్తకాలపై తన బొమ్మను ముద్రించుకున్నారని తెలిపారు. ఇది జగన్ రెడ్డి ప్రచార పిచ్చికి పరాకాష్ట అని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.15 కోట్ల ప్రజాధనాన్ని వృధా చేశారని మండిపడ్డారు. పొలాల సరిహద్దు రాళ్లపై కూడా తన బొమ్మను ముద్రించి జగన్ మోహన్ రెడ్డి రూ.700 కోట్ల ప్రజాధనం వృధా చేశారని తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పాటైన



ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, గతంలో జగన్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పోల్చి చూస్తే ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య ఉన్న తేడా స్పష్టంగా కనిపిస్తుందని గొర్రెపాటి గోపీచంద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్, టిడిపి నాయకుడు, వీరభద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్ట అమలుకు చర్యలు

**ఈ నెల 31 నుంచి ర్యాపిడ్ శాంపిల్ సర్వే నిర్వహణ**

**జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా**



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జులై 30, మేజర్ న్యూస్ :** జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) పటిష్ట అమలుకు రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికాయుత చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనా.. రెవెన్యూ, పౌర సరఫరాలు, పాఠశాల విద్యా శాఖ, ఐసీడీఎస్, తూనికలు–కొలతలు, డీఆర్‌డీఏ, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం తదితర శాఖల అధికారులతో నిత్యవసర సరుకుల ధరల పర్యవేక్షణ, నియంత్రణబీ పీడీఎస్–ర్యాపిడ్ శాంపిల్ సర్వే నిర్వహణ విధివిధానాలపై మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నిధి మీనా మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, వంట నూనె వంటి నిత్యవసర సరుకుల ధరలు నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పటిష్ట పర్యవేక్షణ ద్వారా తనిఖీ ప్రక్రియల ద్వారా ధరల నియంత్రణపై దృష్టిసారించాలన్నారు. అదే విధంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) అమలు తీరు, ఈ వ్యవస్థ ద్వారా అందుతున్న సరుకుల నాణ్యత తదితరాలపై లబ్ధిదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునేందుకు ప్రణాళికాయుతంగా సర్వే చేపట్టాలన్నారు. లబ్ధిదారులతో పాటు అంగన్వాడీ కేంద్రాలు, హాస్టళ్లకు సంబంధించిన



లబ్ధిదారుల నుంచి సమాచారం సేకరించి నివేదికలు సమర్పించాలన్నారు. ఈ నివేదికల ఆధారంగా లోపాలు ఏవైనా ఉంటే సరిదిద్ది మరింత సమర్థవంతంగా ప్రజా పంపిణీ వ్యవస్థ అమలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నా రు. పౌర సరఫరాల విభాగం, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ సర్వేలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావే శంలో డీఎస్‌వో జి.మోహన్‌బాబు, పౌర సరఫరాల డీఎం జి.వెంక టేశ్వర్లు, డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ జె.సునీత తదితరులతో పాటు ఎంఈవోలు, సీడీపీవోలు, హాస్టల్ వార్డెన్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.



## గుడ్ టచ్ బాడ్ టచ్‌ల పట్ల అవగాహన కలిగి ఉండాలి

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** బాల్య, కౌమార దశలో ఉన్న విద్యార్థినిలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన కలిగి ఉండాలని మచిలీపట్నం రూరల్ ఎస్సై పద్మ అన్నారు. మంగళవారం చిన్నాపురం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, చేయవలసిన, చేయకూడని పనుల గురించి వివరించేందుకు ఏర్పాటుచేసిన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్ల ఒంటరిగా కనిపిస్తే వారిని ఆకర్షితులను చేసుకోవడానికి పలు రకాల ప్రలోభాలకు గురి చేస్తూ యువతను చెడు దారి పట్టిస్తున్న వారిని ఆదిలోనే గుర్తించి వారి ప్రవర్తన పై టీచర్లకు ఫిర్యాదు చేయాలని, అలా కాని పక్షంలో హెల్ప్ లైన్ నెంబర్స్100,112 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఉదయభాను, టీచర్స్, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 5 వరకు జనసేన క్రియాశీలక సభ్యత నమోదు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత నమోదుగడువు ఆగస్టు 5 వరకు పొడిగించారని బండి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్రంలో 10 లక్షలు మచిలీపట్నం నియోజకవర్గంలో 7 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు అయినవని పేర్కొన్నారు. ఆగస్టు 5 వరకు పొడిగించిన సమయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈనెల 28వ తేదీతో ముగిస్తున్న క్రియాశీలక సభ్యత్వ నమోదు “ఆగస్టు 5” వరకు పొడిగించారని రామకృష్ణ తెలిపారు. జనసేన పార్టీ క్రియాశీలక ఆన్లైన్ యాప్ కలిగిన వాలంటీర్స్ నియోజకవర్గ పరిధిలో అన్నిచోట్ల సభ్యత్వ నమోదుకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కార్మిక కర్షక సోదరులకు అండగా ఉంటుందని 5 లక్షల రూపాయలు ప్రమాదంలో మరణించిన వారికి లేదా పూర్తిగా మంచానికి పరిమితమైన వారికి బీమా రూపంలో అందుతుందని ప్రమాదంలో గాయపడి అవయవాలు కోల్పోయిన వారికి 2.లక్షల 50 వేలు గాయపడిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం 50 వేల రూపాయలు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వంతో పాటు బీమా వర్తిస్తుందని తెలిపారు. మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ముందుచూపుతో ఏర్పాటు చేసిన క్రియాశీలక సభ్యత్వాలు నాలుగో విడత జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ నేతృత్వంలో మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో ప్రతిష్టాత్మంగా తీసుకున్నామని గతంలో కన్నా అత్యధికంగా సభ్యత్వాలు నమోదు అవుతున్నాయని ఇప్పటివరకు దాదాపుగా 7.వేలకు సభ్యత్వాల నమోదు పూర్తయిందని గడువు ముగింపు లోపు మచిలీపట్నం నియోజవర్గ ఇంచార్జ్ బండి రామకృష్ణ ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదులో కృష్ణాజిల్లాలో మచిలీపట్నం నియోజకవర్గం అగ్రస్థానంలో ఉంటుందని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## శానిటేషన్ డ్రైవ్ పనులను పరిశీలించిన కమిషనర్



**నందిగామ, జులై 30, మేజర్ న్యూస్:** పట్టణంలోని పురపాలక సంఘ పరిధిలో 9 వ వార్డులో జరుగుచున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పనులను మునిసిపల్ కమీషనర్ కె హేమ మాలిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ వర్షాకాలాన్ని దృష్టిలో వుంచుకొని హానికరమైన దోమల సంతాన ఉత్పత్తిని అడ్డుకునేలా డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రము చేయించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.అనంతరం ప్రధాన డ్రెయిన్స్‌లో పూడిక తీయటలో భాగంగా 1వ వార్డులో పూడికలను తీయించారు. 1వ వార్డులో పాత బస్టాండ్‌లో కోటయ్య హోటల్ నుండి పబ్బతి అడితి వరకు పూడిక తీయించడం జరిగింది. సదరు పూడిక తీసి, వెంటనే తీయబడిన సిల్ట్ ను సదరు ప్రాంతము నుండి డంపింగ్ యార్డ్ కు తరలించారు. ఈ కార్యక్రమములో ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ గురునాధం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ సీజ్



**జగ్గయ్యపేట జూలై 30 మేజర్ న్యూస్ :** శాంతి నగర్‌లో అనధికారికంగా ఇసుకను జెసిబి మిషన్ సహాయంతో లోడింగ్ చేస్తున్న వ్యక్తిని సోమవారం రాత్రి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి, సిబ్బంది అదుపులోనికి తీసుకున్నారు. పట్టణంలో శాంతి నగర్ లో నివాసం ఉంటున్న పగడాల శ్రీనివాస రెడ్డి అనే వ్యక్తి తన యొక్క స్థలంలో అనధికరికంగా 40 టన్నులు ఇసుకను నిల్వ ఉంచి రాత్రి సమయంలో దానిని జెసిబి మిషన్ సహాయంతో ఇతర ప్రాంతాలకు తరలించుటకు ప్రయత్నిస్తుండగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో దాడిచేసి పట్టుకొన్నారు. అనంతరం టిప్పర్ యజమానిని,టిప్పర్ డ్రైవర్ ను, జె సి బి ఆపరేటర్ ను అదుపులోకి తీసుకొని,30 టన్నులు ఇసుకతో సహా టిప్పర్ ను, జె సి బి మిషన్‌ను స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల నిమిత్తం టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## పట్టణ పారిశుద్ధ్యం అస్తవ్యస్తంపై మున్సిపల్ చైర్మన్ ఫైర్



**జగ్గయ్యపేట జూలై 30 మేజర్ న్యూస్ :** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వలన మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం ఆస్తవ్య స్తంగా మారిందని ప్రజల నుండి ఫిర్యాదులు అధిక సంఖ్యలో రావటంతో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శానిటేషన్ అధికారులు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుధ్ద్యంలో పరిశుభ్రత లోపించిందని తక్షణమే అధికారులు సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. అంతేకాక సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పారిశుద్ధ కార్మికులు తమ విధి పట్ల అలసత్వం వహిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగ మల్లేశ్వర రావు, శానిటరీ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంవిఆర్ కృష్ణ తేజ ఐఏఎస్ ని కలిసిన గల్లా తిమోతి



మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : భారత దేశంలోనే స్థానిక సంస్థలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న కేరళ రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసిన తెలుగు తేజం ఎంవిఆర్ కృష్ణ తేజ ఐఏఎస్ ని పంచాయతీరాజ్ కమిషనర్ ఆఫీస్ లో ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ల సంఘం అధికార ప్రతినిధి, పెద్ద యాదర సర్పంచ్ గల్లా తిమోతి, ఇతర సర్పంచులు కలిసారు. ఈ సందర్భంగా సర్పంచులు పడుతున్న ఇబ్బందులు వారి విధులు, నిధులు మీద కులంకషంగా దాదాపు రెండు గంటలపాటు చర్చించారు. మచిలీపట్నం సముద్ర తీర ప్రాంతం వెంబడి ఉన్న తమ గ్రామాల్లో తీవ్ర నీటి కొరత ఉందని మా ప్రాంతంలో ఎక్కడ బోర్ వేసిన ఉప్పునీరులభ్యత ఉంటుంది కాబట్టి కాలువల ద్వారా వచ్చే నీటిని చెరువులకు మళ్లించి నీటి సరఫరా చేస్తున్నామని, వేసవికాలం నాలుగు నెలలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మెషిన్ నిధులకు అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వ వాటాను కేటాయించి ఇంటింటికి కులాయి కార్యక్రమాన్ని గ్రామాల్లో ఉన్న చెరువులను తక్షణమే అభివృద్ధి పరిచి తమని ఆదుకోవాలని ఈ విషయమై గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి వివరించాలని కోరారు. ఆయన దానికి సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కారం కోరుతూ ప్రజాసంఘాల పాదయాత్ర




జగ్గయ్యపేట జూలై 30 మేజర్ న్యూస్ : అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికులు సమస్యలు, బూదవాడ ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రజాసంఘాలు సిఐటియు, రైతు సంఘం, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో పాదయాత్ర జేయడం జరిగింది. బూదవాడ గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలనీ కోరుతూ పాదయాత్ర అనంతరం సచివాలయం దగ్గర ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట.కళ్యాణ్, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు.సైదులు, సిఐటియు జిల్లా కార్యదర్శి కై.గోపాల్, జిల్లా నాయకులు ఎం. సోమేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే నటరాజు మాట్లాడుతూ జగ్గయ్యపేట మండల పరిధిలో ఉన్న ఫ్యాక్టరీలో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈప్రమాదాల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు బలవుతున్నారునీ, చట్టప్రకారం ఇవ్వాల్సిన కుటుంబ సభ్యులకు వైద్యం, పిల్లలకు విద్య, ప్రమాదాలు జరగకుండా చర్యలు, జరిగితే పరిహారం తదితర బాధ్యతలను యాజమాన్యం నెరవేర్చడం లేదునీ, ఫ్యాక్టరీ ఉన్న బూదవాడ పరిసర గ్రామాల్లో ఏరకమైన సామాజిక బాధ్యతలను యాజమాన్యం నిర్వహించడం లేదునీ అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకొని వారితో మాట్లాడడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రామానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. పాదయాత్ర ప్రధానమైన డిమాండ్స్ 1. మృతిచెందిన కార్మిక కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం యాజమాన్యం చెల్లించాలి. 2. గాయపడిన కార్మికులకు 50లక్షలు పరిహారం యాజమాన్యం చెల్లించాలి. 3. గాయపడిన కార్మికులు పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలి. 4. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు సిమెంట్ బోర్డు నిర్ణయం మేరకు రూ.41016/- వేతనం చెల్లించాలి. 5. చట్టప్రకారం ఫ్యాక్టరీలో ప్రతి 6నెలలకు సేఫ్టీ ఆడిట్ చేయించాలి. 6. గతంలో ప్రమాదాలు జరిగినప్పుడు ఇచ్చిన హామీలను ఇప్పుడైనా నెరవేర్చాలి. 7. జగ్గయ్యపేటలో 100పడకల ప్రభుత్వ ఆసుపత్రిని బర్నవార్డును నిర్మించాలి. 8. గ్రామాలలోని యువకులకు, మహిళలకు ఫ్యాక్టరీలో ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలి. 9. గ్రామాలలో రోడ్లు నిర్మించాలి. శుద్ధిచేసిన త్రాగునీరు ఇంటింటికీ కుళాయి ద్వారా ఉచితంగా సరఫరా చేయాలి. 10. రాత్రి సమయంలో ఫ్యాక్టరీ వ్యర్థాలను గ్రామాలపై వదలడాన్ని నిలుపుదల చేయాలి. వదిలితే శిక్షార్హం చేసి ఫ్యాక్టరీని తరలించాలి. 11. గ్రామాల్లో ప్రజలకు విద్యా, వైద్యం ఉచితంగా కల్పించే బాధ్యతను ఫ్యాక్టరీ యాజమాన్యం తీసుకోవాలి. 12. సి.ఎస్.ఆర్.నిధులను గ్రామానికి వెచ్చించి అభివృద్ధి చేయాలి. 13. ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలనీ, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. 14. గ్రామ యువకులు, మహిళలకు ఫ్యాక్టరీలో ఉపాధి కల్పించాలి. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ప్రజాసంఘాల నాయకులు రామనాథం, గౌస్ మియా, లింగారావు, కోట కృష్ణ, రాంప్రసాద్, శేషు, రాము, బాలు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యకుల రౌండ్ టేబుల్ వేదికలో పాల్గొన్న మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు




**జగ్గయ్యపేట జూలై 30 మేజర్ న్యూస్ :** పట్టణంలో స్థానిక ఉక్కు కళా వేదికలో బీసీ,ఎస్సీ,ఎస్టీ, ముస్లిం,క్రిస్టియన్ మైనారిటీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అధికారం చర్చా వేదిక జరిగింది. ఈ సమావేశానికి ప్రముఖ విద్యావేత్త కె.వి రత్నం అధ్యక్షత వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ జే పూర్ణచంద్రరావు,రాష్ట్ర అధ్యక్షులు బక్కా పరంజ్యోతి, రాష్ట్ర అధికార ప్రతినిధి లెక్క పోగు వందన్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 77 ఏళ్ళు గడచినప్పటికీ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ కులాల జీవితాల్లో వెలుగు రాలేదని దానికి కారణం ఇప్పటి వరకు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన పాలకవర్గాలు బిసి, ఎస్సీ ఎస్టీ వర్గాలను విస్మరించడమేనని వారు తెలిపారు. గడచిన కాలమంతా ఈ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తూ వారికి న్యాయంగా ఆర్థిక రంగంలోనూ రాజకీయరంగంలోనూ వారి వాటా వారికి దక్కకుండా చేయడమే ఇందుకు కారణమని ఇప్పటికైనా ఆలోచించి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు తమ ఓట్లు తామే వేసుకొని అధికారంలోకి రావడం ద్వారా మాత్రమే తమ సమస్యలను పరిష్కరించుకో గలుగుతారని వారు తెలిపారు. దీని కొరకు ఆగస్టు 18 న విజయ వాడలో "బిసి జన గణన కొరకు" బిసి రౌండ్ టేబుల్ "సమావేశం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో బిసి సోదరులు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి కుల జనగణనకు వ్యతిరేకంగా వున్న పార్టీలను ఓడించే విధంగా కార్యాచరణ చేపట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బహుజన సమాజ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు,రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు,బిసి నాయకులు రామకృష్ణ, అంగడాల పూర్ణ చంద్రరావు, గంగవరపు దేవా,దొండపాటి శామ్యూల్ కుమార్, పలు బిసి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జనవాసల మధ్య వెదజల్లుతున్న దుర్గంధం

- **నిద్రవస్థలో ఉన్న పంచాయతీ అధికారులు**
- **వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు**
- **చెత్త కుప్పను తొలగించమని వేడుకుంటున్న ప్రజలు**

**పెనుగంచిప్రోలు జూలై 30 మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో వెంకటేశ్వర స్వామి దేవాలయం వెనుక బజార్ లో చెత్తచెదారం ఎంతో కాలంగా జనవాసల మధ్య ఉండటం వల్ల దుర్వాసన వెదజల్లుతుంది. ఖాళీ స్థలంలో కుప్పగా వేయడంతో చుట్టుపక్కల ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడడమే కాకుండా రాత్రివేళలో భయంకరమైన దోమలతో జనం అల్లాడి పోతున్నారని స్థానికులు తెలిపారు. ఇక వర్షం వస్తే చెప్పనక్కర్లేదు కుప్ప మొత్తంలో నీరు చేరి మరి రోడ్లపై ప్రవహించడమే కాక కుళ్ళిపోయి చెత్తపై వాలే ఈగలు, దోమల మూలానా పిల్లలు, పెద్దలు ఈ దుర్వాసనకు అసౌకర్యానికి గురవ్వడమే కాకుండా అనారోగ్యానికి గురై ప్రజలు బాధ పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నివాసాల మధ్యలో ప్రజలను అసౌకర్యానికి గురి చేస్తున్న ఈ దుర్గంధం వెద జల్లే దిబ్బను పంచాయతీ అధికారులను తొలగించవలసిందిగా ఆ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

## స్ట్రాంగ్ మెన్ ఆఫ్ ఇండియా గంటా వెంకటేశ్వర్లు

**ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్**



**జగ్గయ్యపేట జూలై 30 మేజర్ న్యూస్ :** ఈనెల 21 నుండి 26 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్లో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో చిల్లకల్లు జడ్పీహెచ్ఎస్ స్కూల్ కు చెందిన పిఈటి గంటా వెంకటేశ్వర్లు 83 కేజీలు కేటగిరిలో పోటీ చేసి బ్యాక్ స్వాడ్ విభాగంలో 220 కేజీలు ఎత్తి గోల్డ్ మెడల్, బెంచ్ ప్రెస్ విభాగంలో 125 కేజీలు బరువును ఎత్తి సిల్వర్ మెడలను సాధించడం జరిగింది. ఓవరాల్ గా గోల్డ్ మెడలు సాధించడం జరిగింది. అంతేకాకుండా స్ట్రాంగ్ మెన్ ఆఫ్ ఇండియా సాధించడం జరిగింది. ఈ సందర్భంగా గంటా వెంకటేశ్వర్లు మంగళవారం శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాతయ్య గంటా వెంకటేశ్వర్లు ని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాళ్లూరు వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ కటికల అనిల్, మార్కపుడి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# చల్లని వాతావరణానికి భయపెడుతున్న విషసర్పాలు

**సర్పరాజులతో వణికిపోతున్న ప్రజలు**

**అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యాధికారులు**

**గడిచిన 4 సంవత్సరాలు దివిసీమను పాములు వణికించాయి**



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** వర్షాకాలం ప్రారంభం కావడం పంట కాలువల్లోని నీరు రావడంతో ఆహ్లాదకరమైన వాతావరణానికి పుట్టలు, కలుగుల్లో ఉండే విషసర్పాలు షికార్లు చేయడానికి పంట పోలాల్లో సంచారం చేస్తున్నాయి. దీంతో రైతన్నలు విషసర్పాలను చూసి బెంబేలెత్తిపోతున్నారు. ఇదే తరుణంలో రైతులు నారుమడులలో నారుని తీసి నాట్లు వేసే సమయంలో పాము కాట్లుకు గురౌతూ ఉంటారు. 2018-2022 వరకు పాముకాట్లుకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కువ మంది గురవ్వడం, కొంత మంది ప్రాణాలు సైతం గాలిలో కలిసిపోయాయి. నారుమడులు, పంట పోలాల్లో ఎలుకలు కుప్పలు తెప్పలుగా చేరుకుంటాయి. వాటిని తినేందుకు వచ్చే పాములు కూలీలను, రైతులను కాటు వేయడం సహజంగా జరుగుతూ ఉంటుంది. ఎండాకాలంలో కలుగుల్లోనికి చేరిన ఎలుకలు వర్షాకాలంలో కలుగుల్లోనికి నీరు చేరడంతో ఎలుకలు అన్ని ఒక్కసారిగా బయటకు వస్తాయి. వాటిని తినేందుకు వచ్చిన పాములు మనుషులను కాట్లు వేస్తున్నాయి. గత రెండు సంవత్సరాలుగా పాముకాట్లు చాలా తక్కువగా నమోదు అయ్యాయి.పాము కాట్లుకు భయపడిన రైతాంగం ఖరీఫ్ వ్యవసాయ సీజన్ పనులు ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో పాము కాట్లుకు గురి కాకుండా ముందస్తు చర్యలతో పనులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని 6 మండలాల్లో ముందుగా ఘంటశాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో వ్యవసాయ పనులు 20 రోజుల ముందుగా రావడంతో అక్కడ పనులు అయి నంతరం దివిసీమలోని అవనిగడ్డ, నాగాయలంక,కోడూరు మండలాల్లో పనులు ప్రారంభిస్తారు. ఖరీఫ్ సీజన్ మొదలవ్వడంతో పోలాల్లోనికి వస్తున్న రైతులు, కూలీలు పాము కాట్ల భారీన పడకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 2019 సంవత్సరంలో దివిసీమలో జరిగిన పాము కాట్లకు ప్రజలు, రైతులు బెంబేలెత్తిపోయారు. మోపిదేవి సుబ్రహ్మణేశ్వర స్వామి వారి ఆలయంలో కూడా పాములు శాంతించాలని హోమాలు సైతం నిర్వహించారు. పాములు సాధారణంగా ఎవరినీ ఏమీ చేయవు. వాటికి ప్రాణభయం మన కంటే ఎక్కువ ఉంది. వాటికి ప్రమాధం సంభవించినప్పుడు అనగా పాముపై కాలు వేసినా, వాటి ఏకాంతానికి భంగం కలిగినా సమయాల్లో మాత్రమే ప్రతిస్పందనగా పాములు కాటువేస్తాయి. కాటు వేసిన వెంటనే ముందు జాగ్రత్తగా ప్రమాదాలను నివారించుకోవచ్చు. పాము కాటుకు గురైన వ్యక్తిని వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వ్యాక్సిన్ వేయించాలన్నారు. పంట పోలాలకు వెళ్ళే రైతులు,కూలీలు ఎన్నో మెలకువలతో జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి. రాత్రి సమయాల్లో మరింత జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతిరైతు టార్చ్‌లైట్, కర్రా తీసుకుని గడ్డివాముల దగ్గర, పంట పోలాల్లోని పుట్టల వద్ద తిరిగే వారు బూట్లు ధరించడం, మోకాళ్ళ వరకు రక్షణ తీసుకోవడం ఎంతైనా అవసరం. వ్యవసాయ పనుల నిమిత్తం పోలాల్లోనికి వెళ్ళినప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి.

**పొలాల్లో సంచరించే పలు రకాల పాములు**

నియోజకవర్గంలోని 6 మండలాల్లో ప్రస్తుత సీజన్‌లో వరి పోలాల్లో రక్త పింజర, కట్లపాము, బురదకొయ్య వంటి పాములు సంచరిస్తాయి. రక్తపింజర కాటు వేసిన ప్రాంతం నుండి రక్తం బాగా కారుతుంది. త్రాసుపాము కాటు వేస్తే నరాల నుండి మెదడులోనికి విషం ఎక్కుతుంది. రక్తపింజర కాటు వేస్తే రక్తం కారుతూ కిడ్నీ ఫేల్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కట్లపాము కాటు వేస్తే రక్తంలోనికి, నరాల్లోనికి విషం ఎక్కడంతో 30 నిమిషాల వ్యవధిలోనే కాటు వేసిన మనిషిని ఆసుపత్రికి తీసుకువెళ్ళకపోతే ప్రమాదతీవ్రత ఎక్కువగా ఉంటుంది. బురదకొయ్య కాటువేస్తే మనిషి ఏ మాత్రం ప్రమాదం ఉండదు. పాము కాటు వేసినట్లుగా తెలిస్తే ఆ వ్యక్తి ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యకుండా కాటు వేసిన పాము ఏ జాతికి సంబంధించినదో పరిక్షించాలి. కేకలు వేసి సమీపంలోని కూలీలను పిలిచి వారి సహాయ సహకారాలతో ఆసుపత్రికి 30 నిమిషాల వ్యవధిలోపల వైద్యులకు తెలియచేయాలి. నాటు వైద్యులను సంప్రదించి పసర మందులు, వేపాకు తినిపించడం వంటివి చేయకూడదు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలోనూ పిహెచ్ సెంటర్లలో యాంటీ వీనమ్ వ్యాక్సిన్ ప్రభుత్వం అందుబాటులో ఉంచుతుంది కాబట్టి వ్యాక్సిన్ తీసుకోవడం ఉత్తమ మార్గం.

## ఆరేళ్లలో ఒక్క రూపాయి కూడా జీతాలు పెంపు లేని గ్రామ రెవెన్యూ సహాయకులు

**ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు**





**విజయవాడ జూలై 30 మేజర్ న్యూస్ :** గత ఆరేళ్ళగా రాష్ట్రంలోని గ్రామ రెవెన్యూ సహాయకులకు ఒక్క రూపాయి కూడా జీతాలు పెంచలేదని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికిపాటి బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఈ మేరకు వారు మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ని కలిసి వినతి పత్రం సమర్పించి పత్రికా ప్రకటన విడుదల చేశారు. అనేక దశాబ్దాలుగా గ్రామ స్థాయిలో పని చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు గత ప్రభుత్వ హయంలో తీవ్ర అన్యాయం జరిగిందని, వారికి సంబంధించిన అనేక న్యాయమైన డిమాండ్లు ప్రధానంగా గత ఆరు సంవ్సరాలుగా ఒక్క రూపాయి కూడా జీతాలు పెరగకుండా, సమస్యలన్నీ అపరిష్కృతంగానే ఉండిపోయాయని , వాటిని పరిష్కరించాల్సిందిగా రెవెన్యూ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్ని ఏ.పి.రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పక్షాన బొప్పరాజు, ఏ.పి.గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం పక్షాన గరికపాటి బ్రహ్మయ్య ఇతర రాష్ట్ర నాయకులు కలిసి వారికి సమస్యలపై విన్నవించి, వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో అతి తక్కువ వేతనం పొందుతున్న గ్రామ రెవెన్యూ సహాయకులు అనేక సంవత్సరాలుగా గ్రామ రెవెన్యూ సహాయకులు నెలకు కేవలం రూ. 1700/- లు గా గౌరవ వేతనం పొందుతుండగా, 2011 లో రూ. 3000/- లకు పెంచగా, తిరిగి నాలుగు సంవత్సరాలకే అనగా 2014 లో 6500/- కు పెంచారు. వెంటనే మరో నాలుగు సంవత్సరాలకు అనగా 2018 లో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రూ .10,500/- లకు పెంచారు. కానీ, గత ఆరు స%××%రాలుగా ఒక్క రూపాయి కూడా జీతాలు పెంచకుండా గత ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సహాయకులు కు తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. రెవెన్యూ శాఖలోనే, కేవలం నెలకు 15 రోజులపాటు రేషన్ షాప్ లకు బియ్యం పంపిణీ చేస్తున్న వాహన ఆపరేటర్లకు (%వీణఖ%) చెల్లించే జీతం 21,000/-కన్నా, అతి తక్కువ వేతనాన్ని 24 గంటలూ పనిచేసే గ్రామ రెవెన్యూ సహాయకులు కేవలం 11,100 రూపాయలు జీతం పొందుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయంలో అనేకసార్లు ఈ విషయాన్ని అనేక సందర్భాల్లో చెప్పినప్పటికీ గ్రామ రెవెన్యూ సహాయకులకు ఎలాంటి సహాయం జరుగక పోగా 2018 నుండి 2021 వరకు చెల్లించిన కరువు భత్యాన్ని వారి జీతాల నుండి షుమారు 13.44 కోట్లు రికవరీ చేయడం దారుణమైన విషయమని తెలుపుతూ కరువు భత్యంను రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఏ.పి.జే.ఏ.సి.పక్షాన చేసిన 92 రోజుల ఉద్యమంలో ప్రాధాన్యఅంశంగా తీసుకోవడం జరిగిందన్నారు. ఉద్యమ ఫలితంగా 2024 సంవత్సరం ఫిబ్రవరిలో గత ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సహాయకులు కరువు భత్యాన్ని పునరుద్ధరిస్తూ రూ.500/- మంజూరు చేస్తూ వేతనం తోపాటు చెల్లిస్తున్నారని తెలిపారు. కావున, 2018 నుండి 2021 వరకు చెల్లించిన కరువు భత్యాన్నీ రికవరీ చేసినందున, చాలి చాలని జీతంతో బ్రతుకున్న చిరుద్యోగులైన గ్రామ రెవెన్యూ సహాయకులకు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించి, వారందరినీ ఆదుకోవాలనీ కోరుచూ రెవెన్యూ శాఖామాత్యులకి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పక్షాన వినతి పత్రం సమర్పించడమైనది. అదేవిధంగా రెవెన్యూ శాఖలో గ్రామస్థాయి వ్యవస్థలో ఏళ్ల తరబడి కీలకంగా ఇరవై నాలుగు గంటలూ విధులు నిర్వహిస్తూ, ఉన్నత విద్యావంతులుగా ఉండి పదోన్నతులు పొందడానికి అర్హతలున్నప్పటికీ సరైన కోటా లేనందున చాలామంది ఏళ్ల తరబడి వి. ఆర్.ఏ లగానే మిగిలి పోతున్నారని పేర్కొన్నారు.

కనుక, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం ఉన్న కోటా పెంచి, నైట్ వాచ్మెన్, ఆఫీసు సబార్డినేటు, చైన్మెన్, గ్రామ రెవెన్యూ అధికారి గ్రేడ్-2 పోస్టులలో సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని కోరుచూ వినతి పత్రం సమర్పించడమైనది. అలాగే, అనారోగ్యం దృష్ట్యా పనిచేయలేకపోతున్న గ్రామ రెవెన్యూ సహాయకులు స్థానాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వాళ్ళ వారసులను అనగా "నామినీ గ్రామ రెవెన్యూ సహాయకులను గ్రామ రెవెన్యూ సహాయకులుగా నియమించి అనేక సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురి కాబడిన వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ రెవెన్యూ శాఖామాత్యులకి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పక్షాన వినతి పత్రాలు సమర్పించడమైనది. రాష్ట్రంలోని వేలాది మంది గ్రామ రెవెన్యూ సహాయకులు గత ఆరు సంవ్సరాలుగా తీవ్రంగా నష్టపోయారని, వారందరూ నూతన ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో ఉన్నారని, ప్రభుత్వం వీరి సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. పైన తెలిపిన అన్ని విషయాలు పై సావధానంగా ఆలకించిన రెవెన్యూ శాఖామాత్యులు చాలా సానుకూలంగా స్పందిస్తూ, తప్పకుండా ప్రతి అంశంపై అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని, ప్రధానంగా తహశీల్దార్/ ఆర్.డి .ఓ కార్యాలయాల వాచ్మెన్ ల నియామకం లాంటి ఒకటి రెండు విషయాల్లో వెంటనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డి .శ్రీనివాస్, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర నాయకులు ఆర్.వి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



### మండల ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు

**కృత్తివెన్ను జూలై 30 మేజర్ న్యూస్ :** మండల ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందిస్తున్నామని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య అన్నారు. మంగళవారం సీతనపల్లి మెగా రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన ఫిల్టర్ బెడ్లు మరమ్మత్తు పనులు పూర్తయిన సందర్భంగా, వాటి పనితీరు ఎలా ఉందో, నీరు పరిశుభ్రంగా ఉందా లేదా అనే అంశాలను నేరుగా రత్తయ్య పరిశీలించారు. గతంలో ఫిల్టర్ చేసే రాళు ఇసుక వగైరా వంటి వాటిని పూర్తిగా తీసివేసి, వాటి స్థానంలో నూతనంగా కంకర,ఇసుక,చిప్స్ వంటి వాటితో పనులు సకాలంలో పూర్తి చేయడం జరిగిందన్నారు. సుమారు తొమ్మిది లక్షల ఏనభై వేల రూపాయలతో రెండు ఫిల్టర్ బెడ్లను మరమ్మత్తులను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో పెడన నియోజకవర్గ కూటమి శాసనసభ్యులైనా కాగిత కృష్ణ ప్రసాద్ కృషి ఎంతగానో ఉందన్నారు. పెడన నియోజకవర్గం లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలు పట్ల శాసనసభ్యులు మన కృష్ణ ప్రసాద్‌కి పూర్తి అవగాహన ఉందన్నారు.నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపించే దమ్మున నాయకుడు కాగిత కృష్ణ ప్రసాద్ అని వ్యాఖ్యానించారు. ముందుగా ఫిల్టర్ బెడ్లను ఆర్డబ్ల్యూస్ ఈఈ శివప్రసాద్, డి ఈ నటరాజ్ పరిశీలించారు. యధావిధిగా నీటి పంపిణీ జరుగుతుంది అన్నారు. వారి వెంట ఏఈ నాగేశ్వరరావు, కాంట్రాక్టర్ చంటి ఉన్నారు.

# విద్యార్థి దశ నుండి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి





## నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ రాజు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** విద్యార్థి దశ నుండి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని విజయవాడ, పటమట నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ రాజు సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు క్యాబినెట్ ఎలక్షన్స్ నిర్వహించి, హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, జూనియర్ హెడ్ బాయ్, జూనియర్ హెడ్ గర్ల్, గ్రూప్ క్యాప్టెన్స్ గా గెలుపొందిన విద్యార్థులకు బ్యాడ్జస్ ప్రదానం చేసి, నాయకులుగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏజీఎం మురళీ కిషోర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ రాజు మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశ నుంచి పెంపొందించడం వలన మెరుగైన సమాజాన్ని నిర్మించుకోగలుగుతామన్నారు. విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను చేరుకునేలా ఎల్లప్పుడు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. తమ పిల్లలు ఏవిధంగా ఆలోచిస్తున్నారనే అవగాహన తల్లిదండ్రుల్లో ఉండడం ముఖ్యమన్నారు. నాయకత్వ లక్షణాలను విద్యార్థులు అలవరుకున్నప్పుడు వారు బాహ్య ప్రపంచంలోని అన్ని రంగాల్లో ముందు వరుసలో రాణిస్తారన్నారు. విద్యార్థులంటే రేపటి భవిష్యత్తని, ఆ భవిష్యత్తుని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకం అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజు, అకాడమిక్ డీన్ మధు, ఎస్ఎస్ టీ విద్యాసాగర్ పాల్గొన్నారు.




# ప్రభుత్వాస్పత్రి లో కొత్త ఎక్స్‌రే యంత్రం ప్రారంభించిన ఎమ్మెల్యే




**నందిగామ, జులై 30, మేజర్ న్యూస్ :** పట్టణంలోని స్థానిక ప్రభుత్వాస్పత్రి బ్లాకులో కొద్ది రోజుల నుంచి ఎక్స్‌రే యంత్రం పనిచేయక రోగులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులతో మాట్లాడి కొత్త ఎక్స్ రే యంత్రాన్ని ఏర్పాటు చేసి మంగళవారం పట్టణ పార్టీ, స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలకు నిలబెట్టే ఆసుపత్రులు ఆలయాలతో సమానం అని అన్నారు. త్వర లోనే వైద్య, ఆరోగ్య శాఖలో పెద్ద ఎత్తున ప్రక్షాళన చేసి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధిస్తామని ఆ శాఖ మంత్రి సత్య కుమార్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సత్యనారాయణ, బొందలపాటి సీతారావమ్మ, ఆసుపత్రి సిబ్బంది, వివిధ హోదాలో ఉన్న టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లోనే నిజమైన క్రీడా ప్రతిభ ఉంది

## ప్రధాన ఉపాధ్యాయురాలు నిమ్మగడ్డ రవీంద్ర భవాని



**గన్నవరం, జులై 30, మేజర్ న్యూస్ :** పల్లెల్లోనే నిజమైన క్రీడా ప్రతిభ ఉందని గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నిమ్మగడ్డ రవీంద్ర భవాని అన్నారు మంగళవారం క్రీడా ప్రాంగణం లో హెచ్.సి.యల్, హీల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సౌజన్యం తో గన్నవరం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి "చెస్' పోటీలను రవీంద్ర భవాని ప్రారంభించారు. అనంతరం రవీంద్ర భవాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బాల, బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గన్నవరం క్రీడా మైదానం ఉత్తమ క్రీడాకారులకు నిలయమని క్రీడల ప్రోత్సాహనికి తమ సహకారం ఎప్పుడు ఉంటుందని ఆమె తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే వి ఆర్ కిషోర్ మాట్లాడుతూ మట్టిలో మాణిక్యలను ఇటు చదువులోను అటు క్రీడలలోనూ రాణిస్తున్న విద్యార్థును గుర్తించి వాకర్స్ అసోసియేషన్ తోడ్పాటు నందిస్తున్నట్లు తెలిపారు. హెచ్.సి.యల్, హీల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సమన్వయకర్త బి.సత్యనారాయణ రావు మాట్లాడుతూ క్రీడాకారుల ఆసక్తిని బట్టి ఆయా క్రీడలలో రాణించేలా యువతను ప్రోత్సాహించేందుకే తమ ఫౌండేషన్ పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ముక్కామల సుబ్బారావు, గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు పోటీలను పర్యవేక్షి హించారు. ఈ కార్యక్రమం లో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు వెంకటేశ్వరావు, బాల కృష్ణ, రాంబాబు, కృష్ణ ప్రియ, గీత, శ్రీదేవి, జనంజన రాజు, గోపి, మల్లికా తదితరులు పాల్గొన్నారు.



## ప్రారంభోత్సవానికి సిద్ధం అవుతున్న అన్నా క్యాంటీన్




**నందిగామ, జులై 29, మేజర్ న్యూస్ :**ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో ఆగస్టులో ప్రారంభిస్తున్న సందర్భంగా నందిగామ పట్టణం కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న అన్నా క్యాంటీన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి అతి త్వరలోనే మరలా తిరిగి నందిగామలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్నందుకు పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐదు రూపాయలకే మరల తిరిగి అందరికీ నాణ్యమైన భోజనం అందరికీ అందుబాటులోకి వస్తుంది.

## ఎమ్మెల్యే మండలి మరమత్తులు చేయరూ....



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామానికి తాగునీరు అందిస్తున్న వాటర్ ట్యాంక్ నిశ్చన మెట్లు శిధిలావస్థకు చేరుతున్నాయి. బుద్ధప్రసాద్ మరమత్తులు నిర్వహించి అభివృద్ధి చేయాలని వాటర్ ట్యాంక్ గగ్గోలు పెడుతుంది. 2007 లో అప్పటి శాసన సభ్యులు, ప్రస్తుత ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్ తాగునీటి సరఫరా ట్యాంక్ ను ఆ నాడు ప్రారంభించగా నేడు అది కాస్తా శిధిలావస్థకు చేరింది. భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సమస్యలలో ఉన్న గ్రామానికి మండలి బుద్ధప్రసాద్ చొరవతో ఆ వాటర్ ట్యాంక్‌ను నిర్మాణం చేసి ప్రజలకు వినియోగంలోనికి తీసుకువచ్చారు. గత 17 సంవత్సరాలుగా గ్రామానికి త్రాగునీటిని అందిస్తున్న ఈ వాటర్ ట్యాంక్ మెట్లు ల్యాండింగ్ పూర్తిగా దెబ్బతింది. అయితే 10, 15 రోజులకు ఒక సారి వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు ఇద్దరు లేక ముగ్గురు ట్యాంక్‌లోకి దిగవలసి ఉంది. ఈ క్రమంలో మెట్లు ల్యాండింగ్ పూర్తిగా శిధిలమవ్వడంతో పాటు మరికొన్ని చోట్ల రక్షణగా ఉన్నటువంటి హ్యాండిల్ సరిగా లేకపోవడంతో ఆ మెలిక ఉన్న మెట్లు ఎక్కి, దిగడం ప్రాణ సంఘటనగా మారింది.

దీనితో వాటర్ ట్యాంక్ శుభ్రం చేసేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ దృష్టికి ప్రజాప్రతినిధులు ఎవరూ కూడా తీసుకురాకపోడం ఆ గ్రామ ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యమా అని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై మండలితో పాటు సంబంధిత అధికారుల స్పందించి పరిష్కార మార్గం చూపించాలని ఎడ్లంక గ్రామస్థులు కోరుతున్నారు.

17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999